# జానపద సాహిత్యంలో పురాణాలు

—చిగిచర్ల కృష్ణారెడ్డి

సాహిత్యంలో శిష్ట సాహిత్యమని, జానపద సాహిత్యమని రెండు విభాగా లున్నాయి. శిష్ట సాహిత్యం వ్యక్తి సృష్టి. జానపద సాహిత్యం సమూహసృష్టి. పురాణమన్న సాహిత్య ప్రక్రియ సంస్కృతభాషలో శిష్ట సాహిత్యస్థాయిని పొందింది. దీన్నే 'మైథాలజీ' అని అంటారు. చరిత్రకు పూర్వ దశల్లో మానవ సంస్కృతి, సామాజిక విలువలు, మానవుల అవగాహన వీటిని ప్రతిబింబించే రచనలు ప్రపంచం లోని అన్ని భాషలోనూ మౌఖిక సాహిత్యంగా ప్రజల నోళ్ళలో, పెద్దమ్మ చెప్పేకథల్లో, పొడిచే చాటువుల్లో పాడుకొనే పాటల్లో మిగిలి ఉంటాయి. పుక్కిటి పురాణమని, కట్టుకథలని తేలిగ్గా కొట్టిపారవేసే ఈ వాఙ్మయంలో మానవుడు సృష్ట్యాది నుంచీ ఎలా పరిణమిస్తూ వచ్చాడో ప్రకృతిని ఎలా విద్వేషించాడో, తన ఉనికిని ఎలా గుర్తింగాడో అన్న విషయాలే ఏ భాష లోనైనా పురాణేతిహాసాల పేరిట కర్మకాండతో ముడి పడి ప్రజల అలవాట్లలో మిళితమై, జీవితంలో భాగమై వారి కార్యకలాపాలకు తాత్త్విక ప్రేరణగా మిగిలి ఉంటాయి.

పురాణంలో వస్తువుకి సంబంధించినంత వరకు శిష్ట జానపద వాఙ్మయాలలో భేదం తక్కువే. కానీ రూపంలో మాత్రం జానపద పురాణాలు కొన్ని ప్రత్యేకతల్ని కల్గి ఉన్నాయి. ఒక్కోసారి దీని ప్రభావం వస్తు స్వరూప అవగాహన మీద కూడా పడుతుంది. ఎప్పటికప్పుడు మానవుడు తన జీవితంలో వస్తున్న పరిణామాన్ని తన చుట్టూ ఉన్న పరిసరాలను, వ్యక్తులను, స్వభావాలను పురాణకథ ల్లోకి ఎక్కించటం జానపద పురాణంలో శిష్టుల పురాణంలో లేని ఒక నిత్య పరిచయ లక్షణం (Popularity) కొట్టవచ్చి నట్టు కన్పిస్తుంది.

సంస్కృతంలో పదునెనిమిది పురాణాలున్నాయి[1]. (అష్టాదశ పురాణాలు) వాటిలో 'భారత భాగవతాదులు' జానపదులకు చాలా పరిచయంలో ఉన్న విషయాలు. ఇతిహాసాల్లో రామాయణం ఎక్కువ ప్రీతిపాత్రమైనది 'రామాయణం' కథాగమన రీతిలో కావ్యమే అయినా పురాణ ప్రసిద్ధి ఉన్న ఇతివృత్తమైంది. జానపదులు ఎక్కువగా పాడుకొనే పాటలు రామాయణ భారత భాగవతాల్లోనివి.

కానీ నిమ్నజాతుల్లో దేశీయతా ముద్ర ఉన్న ఇతర పురాణాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు ఆసాది వాళ్లలో ప్రచారంలో ఉన్న 'మాతాపురాణం' శాక్తేయ మతానికి సంబంధించింది. అతి ప్రాచీనమైన మాతృస్వామ్య సమాజాన్ని ప్రతిబింబింపచేసే 'శక్తి' పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించిన కథలు శిష్టుల కంటె భిన్నంగా జానపదుల్లో మాత్రమే ప్రచారంలో ఉంది. ఆదిపరాశక్తి ఒక గుడ్డు పెట్టిందని ఆ గుడ్డులోంచి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు పుట్టారని చెప్పే 'ముగ్గురమ్మల మూలపుటమ్మ' కథ జానపదులకు మాత్రమే తెలుసు. మాతాపురాణంపేరిట తెలంగాణా ప్రాంతంలో బవనీలు (జైండ్లు) పాడే పాట శాక్తేయ వీర శైవాలకున్న మతపరమైన సంఘర్షణను సూచించేది. ఆసాది వాండ్లు రాయలసీమలో పెద్దమ్మకథ అనే పేరిట దీన్ని పాడుతారు.